నమస్తే తెలంగాణ
# జనగామ
5 | మంగళవారం 20 ఫిబ్రవరి 2024 | JANAGAON



లక్ష్మీపురంలో పగిడిద్దరాజు బస చేయనున్నది ఇక్కడే..

## నేడు లక్ష్మీపురానికి పగిడిద్దరాజు

### మంగళవారం రాత్రి బస చేసి బుధవారం మేడారానికి చేరిక

గోవిందరావుపేట, ఫిబ్రవరి 19 : మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు పగిడిద్దరాజు రానున్నారు. మహబూబాబాద్ జిల్లా గంగారం మండలంలోని పూనుగొండ్ల నుంచి మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి సుమారు 35 కిలోమీటర్ల దట్టమైన అడవిలో పగిడిద్దరాజును పెనక వంశీయులు తీసుకురావడం ఆనవాయితీ. ఈ సారి లక్ష్మీపురం గ్రామంలో 20 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించిన షెడ్‌లో మంగళవారం రాత్రి పగిడిద్దరాజు బస చేయనున్నారు. బుధవారం ఉదయం అక్కడి నుంచి బయలుదేరి పస్రా మీదుగా మేడారానికి చేరుకుంటారు. ఈ సందర్భంగా పెనక వంశీయులతో పాటు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.



ఇలవేల్పులను కొలుస్తున్న కోయలు (ఫైల్)

## మేడారంలో 21నుంచి ఇలవేల్పుల సమ్మేళనం

### నాలుగు రాష్ట్రాల నుంచి పాల్గొననున్న కోయలు

ఏటూరునాగారం, ఫిబ్రవరి 19 : మేడారం ఆదివాసీ మ్యూజియంలో ఈనెల 21నుంచి 23 వరకు కోయ గిరిజనుల ఇలవేల్పుల సమ్మేళనం మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు పెసా జిల్లా కో ఆర్డినేటర్ ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. రెండేళ్లకో సారి జరిగే జాతరకు వివిధ ప్రాంతాలకు చెందిన కోటి మంది భక్తులు వస్తున్నందున తమ తెగలు, ఇలవేల్పుల చరిత్రను చాటి చెప్పేందుకు సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణ, ఏపీకి చెందిన కోయ గిరిజనులు కొలిచే ఇలవేల్పులను వారి తలపతులు మేడారం తీసుకురానున్నట్లు చెప్పారు. సమ్మక్క-సారలమ్మ గద్దెలను దర్శించుకోవడం వల్ల ఇలవేల్పుల ప్రాంతాల్లో భక్తిభావం పెరుగుతుందని కోయల విశ్వాసం ఉందన్నారు. ఇలువేల్పుల్లో కోయ తెగ గోత్రాలు ప్రత్యేకంగా ఉంటాయి. కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి, కలెక్టర్, ఐటీడీఏ పీవో కోయ గిరిజన ప్రతినిధులు పాల్గొంటారని ప్రభాకర్ తెలిపారు.

### మీడియా పాయింట్ ప్రారంభం

గద్దెల ప్రాంగణంలో నిర్మించిన మంచెను సమాచార శాఖ కమిషనర్ హన్మంతరావుతో కలిసి మంత్రులు పొంగులేటి, సీతక్క ప్రారంభించారు. కవరేజ్‌లో మీడియా ప్రతినిధులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించిన సీతక్క నూతన మీడియా పాయింట్ నిర్మించాలని కలెక్టర్‌కు సూచించడంతో మంచెను ఏర్పాటు చేశారు.



మీడియా పాయింట్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మంత్రి సీతక్క

- జాతరకు రెండు కోట్ల మంది వచ్చే అవకాశం
- భక్తులకు సకల సౌకర్యాలు కల్పించాం
- మంత్రులు పొంగులేటి, సీతక్క

## వీఐపీలు ములుగు వరకే..

### అక్కడి నుంచి ఆర్టీసీ బస్సులో మేడారానికి రావాలి

తాడ్వాయి, ఫిబ్రవరి 19 : మహా జాతరకు వచ్చే వీఐపీలు తమ వాహనాలను ములుగులో పార్కింగ్ చేసి ఆర్టీసీ బస్సులో మేడారానికి చేరుకోవాలని రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. సోమవారం మంత్రి పొంగులేటి మేడారం పర్యటనకు రాగా మంత్రి సీతక్క, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీష్ ఘన స్వాగతం పలికారు. మంత్రులకు పూజారులు, దేవాదాయ శాఖ అధికారులు స్వాగతం పలికి తల్లుల గద్దెల వద్దకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా పొంగులేటి ఎత్తు బెల్లం సమర్పించి మొక్కులు చెల్లించారు. గద్దెల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో స్థానిక మంత్రి సీతక్క ఆధ్వర్యంలో జాతరను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. అసెంబ్లీ సమావేశాలు నడుస్తున్నా తన నియోజకవర్గంలో జరిగే జాతర అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తూ భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు సీతక్క ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. దర్శనానికి రెండు కోట్ల మంది భక్తులు వస్తారనే అంచనా ఉందని, అందుకు తగినట్లు ఏర్పాట్లు చేశామన్నారు. జీరో టికెట్‌పై ఇప్పటికే రాష్ట్రంలో 17 కోట్ల మంది మహిళలు బస్సు ప్రయాణం చేశారని మంత్రి తెలిపారు. జాతర నిర్వహణకు 16వేల మంది అధికారులు పనిచేస్తున్నారని, 4వేల మంది కార్మికులతో పారిశుధ్య పనులు చేపడుతున్నట్లు చెప్పారు. మేడారానికి అనుసంధానం ఉండే 270 కిలోమీటర్ల రోడ్లను నిర్మించినట్లు తెలిపారు. వీఐపీలు ములుగులో వాహనాలు పార్కింగ్ చేసి ఆర్టీసీ బస్సులో మేడారానికి రావడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయన్నారు. వీఐపీలు సైతం సహకరించాలని కోరారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు రెండు నెలల నుంచి శ్రమించి భక్తులకు సౌకర్యాలు కల్పించారన్నారు. గత జాతరలో పనిచేసిన ఐదుగురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల సేవలను వినియోగిస్తున్నట్లు తెలిపారు. 1996లోనే సమ్మక్క-సారలమ్మ జాతరకు రాష్ట్ర పండుగగా గుర్తింపు వచ్చిందని, కేంద్ర ప్రభుత్వం కూడా గుర్తించాల్సి ఉందన్నారు. జాతర పూర్తయిన తర్వాత ఖర్చులన్నీ ప్రజల ముందు పెడతాం, మిగిలిన డబ్బుతో జాతరలో శాశ్వత నిర్మాణాలు చేపడుతామన్నారు.



నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రదర్శనలో మోడల్

## హరితలో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 19 : హనుమకొండలోని హరిత కాకతీయలో సహజమైన ఫైబర్ సిల్క్ ప్రదర్శన ఏర్పాటు చేశారు. దేశం నలుమూలల నుంచి సిల్క్ ఉత్పత్తుల తయారీదారులు బనారస్, కాంచీపురం, బీహార్ టస్సర్, గుజరాత్, బంధిని, పటోలా, వెస్ట్‌బెంగాల్ బేలు, హ్యాండ్ పెయింటెడ్ శారీ, ఢాకాయి జందాని, పైథాని, చందేరి, ఇరి (అహింస) శారీ, శిబోరి, అజ్రక్ ప్రింట్, హ్యాండ్ కళంకారి, డ్రెస్ మెటీరియల్ ప్రదర్శనలో ఉంచినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 22 వరకు నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రదర్శన కొనసాగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మహా జాతరలో ప్లాస్టిక్ వినియోగించొద్దు

### కాలుష్య నియంత్రణ మండలి ఉమ్మడి జిల్లా అధికారి సునీత

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 19 : మేడారం మహాజాతరను కాలుష్య, ప్లాస్టిక్ రహితంగా జరుపుకోవాలని కాలుష్య నియంత్రణ మండలి ఉమ్మడి వరంగల్ జిల్లా అధికారి సునీత ఒక ప్రకటనలో కోరారు. కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయ అధికారులు పర్యావరణ అనుకూల మేడారం జాతర ప్రచారానికి 6 వేల పోస్టర్లు, 300 క్లాత్ బ్యానర్ల ప్రదర్శనతో పాటు మొబైల్ వ్యాన్ ద్వారా స్కూల్ పిల్లలు, గ్రామాల్లో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శిక్షణ పొందిన 300 మంది వలంటీర్లు జాతరలో వస్త్ర సంచుల పంపిణీ, కళాజాత నిర్వహిస్తామన్నారు. రేడియోలో జింగిల్స్ ప్రసారం, టీవీల్లో స్క్రోలింగ్, మాంసం, ఇతర వ్యర్థాలను నేరుగా రెండరింగ్ ప్లాంట్లకు పంపడం, బెల్లం సేకరణ, బయో మెడికల్ వ్యర్థాలను నిర్వీర్యం చేసే పరిశ్రమకు పంపిస్తామని అందులో పేర్కొన్నారు. జంపన్న వాగులో నీటి నాణ్యతను పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. మేడారం జాతరకు భక్తులు ప్లాస్టిక్ వస్తువులను తీసుకురావొద్దని, వస్త్ర సంచులు, స్టీల్ గ్లాసులు వినియోగించి పర్యావరణ హిత జాతర జరుపుకోవాలని ఆమె కోరారు.




కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం

## ప్రతిభతో మూడు పోస్టుల సాధించిన సోనీ

### సబ్ ఇన్‌స్పెక్టర్‌గా మేడారంలో బాధ్యతలు



ఎస్సై పోస్టుకు ఎంపికైన సోనీ

బచ్చన్నపేట, ఫిబ్రవరి 19: ప్రభుత్వ ఉద్యోగాలకు పోటీ నెలకొన్న తరుణంలో మండలంలోని కొన్నె గ్రామానికి చెందిన కందుకూరి సోనీగౌడ్ ఏకంగా మూడు పోస్టులకు ఎంపికై శభాష్ అనిపించుకుంది. కందుకూరి బుచ్చమ్మ-శంకరయ్య దంపతుల కుమార్తె సోనీగౌడ్ నిరుపేద కుటుంబంలో పుట్టి ఒకటి నుంచి పదో తరగతి వరకు కొన్నె ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంది. జనగామలో ఇంటర్, డిగ్రీ, బీఈడీ పూర్తి చేసింది. పై చదువుల కోసం హనుమకొండలోని ఓ ప్రైవేట్ హాస్టల్లో ఉంటూ జీనియస్ సీఈవో రాము కోచింగ్ సెంటర్‌లో 2022, 2023లో ఎస్సై పోటీ పరీక్షలకు కోచింగ్ తీసుకుంది. కానిస్టేబుల్, ఎస్సై పోస్టులకు పరీక్ష రాసి రెండింట్లో అర్హత సాధించింది. ఇటీవల ప్రకటించిన గ్రూప్-4 ఫలితాల్లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికైన సోనీ గౌడ్ పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టును ఎంచుకుని హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో శిక్షణ పొందింది. ప్రస్తుతం ములుగు జిల్లా మేడారంలో సమ్మక్క జాతరలో డ్యూటీ చేస్తున్నట్లు సోనీగౌడ్ తెలిపారు. ప్రతిభతో మూడు ఉద్యోగాలు సాధించిన సోనీని ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అభినందించారు.



మార్కెట్‌కు వచ్చిన మిర్చి బస్తాలు

## పోటెత్తిన ఎర్ర బంగారం

- ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు లక్షకు పైగా మిర్చి బస్తాల రాక
- ఈ సీజన్‌లో ఇదే అత్యధికం
- వ్యాపారులు, కార్మికుల హర్షం

కాశీబుగ్గ, ఫిబ్రవరి 19: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు ఎర్ర బంగారం పోటెత్తింది. లక్షకు పైగా మిర్చి బస్తాలు రావడం ఈ సీజన్‌లో ఇదే అత్యధికం. దీంతో మార్కెట్‌లో ఎటు చూసినా మిర్చి బస్తాలే దర్శనమిచ్చాయి. మిర్చి యార్డుతోపాటు అపరాలు, పత్తి యార్డులు, అంతర్గత రోడ్లు బస్తాలతో నిండిపోయాయి. మార్కెట్‌కు డిసెంబర్ నుంచి కొత్త మిర్చి వస్తున్నది. సీజన్ ప్రారంభంలో రెండు వేల నుంచి 10 వేల బస్తాల వరకు వచ్చాయి. సంక్రాంతి పండుగ తర్వాత మార్కెట్‌కు మిర్చి బస్తాలు పెద్ద మొత్తంలో వస్తున్నాయి. ఈ నెలలో ప్రతి రోజూ 30 వేల నుంచి 50 వేల వరకు బస్తాలు వస్తున్నట్లు అధికారులు తెలిపారు. అయితే, సమ్మక్క-సారలమ్మ జాతరను పురస్కరించుకొని మార్కెట్‌కు ఐదు రోజులు సెలవు ఉండడంతో సోమవారం లక్షకు పైగా మిర్చి బస్తాలను రైతులు తీసుకొచ్చారు. వ్యాపారులు రాత్రి వరకు కాంటాలు నిర్వహించారు. ధర నచ్చని రైతులు తమ సరుకును కోల్డ్ స్టోరేజీలకు తరలించారు. మరికొందరు మార్కెట్‌లోనే భద్రపరుచుకున్నారు. ధర నిలకడగానే ఉన్నట్లు వ్యాపార వర్గాలు తెలిపాయి. మిర్చి రాక పెరగడంతో అడ్తి, ఖరీదు వ్యాపారులతోపాటు దడువాయి, గుమస్తా, హమాలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు మార్కెట్‌కు 3 లక్షల 20 వేల క్వింటాళ్లకు పైగా మిర్చి వచ్చినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి. తేజ రకం క్వింటాల్‌కు రూ. 21 వేలు, వండర్‌హాట్ రూ. 21,500, యూఎస్ 341 రూ. 20,500, దీపిక రకం రూ. 20 వేలు, దేశీ రకం రూ. 38,500, తాలు రూ. 8500 పలికినట్లు వ్యాపారులు పేర్కొన్నారు.

## జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు

### మేడారంలో డీజీపీ రవిగుప్తా



సమ్మక్కను దర్శించుకుంటున్న డీజీపీ రవిగుప్తా

తాడ్వాయి, ఫిబ్రవరి19 : జాతరను ప్రశాంతంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు పోలీస్‌శాఖ ప్రణాళికతో ముందుకు పోతున్నదని డీజీపీ రవి గుప్తా అన్నారు. మేడారం జాతర పరిసరాల్లో సోమవారం ఎస్పీ శబరీష్ ఇతర పోలీస్ అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తీసుకున్న చర్యలు, వాహనాల పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. రోడ్డు ప్రమాదాలు జరుగకుండా, వాహనాలు రోడ్లపై చెడిపోతే తీసుకునే చర్యలను అడిగి తెలుసుకున్నారు. జాతర విజయవంతంలో పోలీసులదే క్రియాశీలక పాత్ర అని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడడంతో పాటు భక్తులతో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. అనంతరం ఆయన తల్లులను దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

### ఎనుమాముల మార్కెట్‌కు ఐదు రోజులు సెలవు

కాశీబుగ్గ, ఫిబ్రవరి 19: వరంగల్‌లోని ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు ఐదు రోజులు సెలవు ప్రకటించినట్లు కార్యదర్శి క్యారం సంగయ్య తెలిపారు. మేడారం జాతరను పురస్కరించుకొని చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్, గుమస్తా, హమాలీ, దడువాయిల అభ్యర్థన మేరకు ఈ నెల 21 నుంచి 23 వరకు సెలవు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. శనివారం వారాంతపు యార్డు బంద్, ఆదివారం వారాంతపు సెలవు అని తెలిపారు. 26 నుంచి మార్కెట్‌లో క్రయవిక్రయాలు యథావిధిగా కొనసాగుతాయని తెలియజేశారు. రైతులు సెలవు రోజుల్లో మార్కెట్‌కు వ్యవసాయ ఉత్పత్తులు తీసుకురావద్దని కోరారు.

### మేడారంలో బ్యాటరీ కారు

తాడ్వాయి, ఫిబ్రవరి19 : మేడారం జాతర సందర్భంగా బ్యాటరీ కారును దేవాదాయశాఖ అధికారులు అందుబాటులోకి తీసుకొచ్చారు. నడవలేని సీనియర్ సిటిజన్లను గద్దెల ప్రాంగణం వరకు తీసుకువెళ్లి తిరిగి తీసుకువచ్చేందుకు దీనిని వినియోగించనున్నారు. దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్ ఆదేశాల మేరకు యాదగిరిగుట్ట దేవస్థానం నుంచి సోమవారం బ్యాటరీ కారును తీసుకువచ్చారు. నేటి నుంచి ఈ కారును అందుబాటులోకి తేనున్నారు.



మేడారానికి తీసుకువచ్చిన బ్యాటరీ కారు

### చలివాగు ప్రాజెక్టు మరమ్మతులు ప్రారంభం

'నమస్తే' కథనానికి స్పందన

శాయంపేట, ఫిబ్రవరి 19 : మండలంలోని చలివాగు ప్రాజెక్టు మరమ్మతులు సోమవారం ప్రారంభమయ్యాయి. కాంట్రాక్టర్ చలివాగుపై జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. ప్రాజెక్టు మరమ్మతులకు గతంలో కేసీఆర్ సర్కారు రూ.10.30 కోట్లు మంజూరు చేసింది. పనుల దృష్ట్యా ఇరిగేషన్ అధికారులు చలివాగు యాసంగి కింద క్రాప్ హాలిడే ప్రకటించారు. అక్టోబర్‌లో అగ్రిమెంట్ జరిగినా కాంట్రాక్ట్ ఏజెన్సీ పనులు మొదలు పెట్టకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో 'నెల రోజులు గడుస్తున్నా.. మొదలు కాని చలివాగు మరమ్మతులు' అనే 'నమస్తే'లో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీంతో ఇరిగేషన్ అధికారులు పనులు చేపట్టేలా కాంట్రాక్ట్ ఏజెన్సీపై ఒత్తిడి తెచ్చారు. దీంతో కాంట్రాక్టర్ ముళ్లపొదలను తొలగించి, పనులు ప్రారంభించారని ఇరిగేషన్ ఏఈఈ అమృత్ తెలిపారు. ప్రాజెక్టు తూము పూర్తిగా శిథిలమైనందున కొత్తది నిర్మిస్తారని, బండ్‌ను బలోపేతం చేయడం, 14 కిలోమీటర్ల కాల్వ లైనింగ్ పనులు చేస్తారని చెప్పారు.



కట్టపై జంగిల్ క్లియరెన్స్ పనులు

## తల్లుల సన్నిధిలో భక్తజనం

తాడ్వాయి, ఫిబ్రవరి 19 : వనదేవతల దర్శనానికి సోమవారం భక్తులు భారీగా తరలివచ్చారు. మొదట జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేసి తలనీలాలు సమర్పించారు. అక్కడి నుంచి గద్దెల వద్దకు చేరుకొని సమ్మక్క-సారలమ్మకు మొక్కులు చెల్లించారు. జాతర పరిసరాల్లో భక్తులు విడిది చేస్తుండడంతో సందడిగా మారుతోంది. కాగా, ఐదు లక్షల మంది భక్తులు మొక్కులు చెల్లించినట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

### జేబు దొంగల చేతివాటం

తల్లుల దర్శనంలో భక్తులు బిజీగా ఉంటే ఇదే అదనుగా జేబు దొంగలు తమ చేతివాటం చూపిస్తున్నారు. సోమవారం 27మంది పర్సులు, సెల్ ఫోన్లు, డబ్బులను కాజేశారు. గద్దెల వద్ద సీసీఎస్, పోలీస్ సిబ్బంది ఉన్నా భక్తుల ముసుగులో తమ పని కానిచ్చేస్తున్నారు. పోలీసులు అనుమానితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నా దొంగతనాలు మాత్రం ఆగడం లేదు.





తల్లులకు మొక్కుతున్న మహిళ

సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద భక్తుల రద్దీ





ఎత్తు బెల్లంతో తల్లుల సన్నిధికి వస్తున్న భక్తులు

